క్లుప్తంగా

కుందేరులో ఎమ్మెల్యే పార్థసారథి ప్రత్యేక పూజలు

కంకిపాడు: మండలంలోని కుందేరు గ్రామంలో పునఃప్రతిష్ట జరిగిన రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానాన్ని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గురువారం సందర్శించి, స్వామి వారికి విశేష పూజలు చేయించారు. రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానం శిఖర ప్రతిష్ట, ధ్వజస్తంభ పునః ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహించామని నిర్వాహక ప్రతినిధులు ఎమ్మెల్యే పార్థసారథికి వివరించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేకు అర్చక ప్రతినిధులు ఘన స్వాగతం పలికి స్వామి వారి దర్శనం, ఆశీర్వచనం అందించారు. సర్పంచ్ కలకోట రాధిక, ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి బిందుమాధవి, ఉపసర్పంచ్ మార్తమ్మ, పార్టీ నేతలు కలకోట లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, తాతినేని కిషోర్, పీఏసీఎస్ చైర్మన్ ఆకుల రంగారావు, ఆలయ ప్రతినిధి కె.జనార్ధన్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

పెనమలూరు: తాడిగడపలో సెక్యూరిటీ గార్డుపై వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోరంకికి చెందిన కె.నాగసత్యఫణి తాడిగడప ఎల్‌వీప్రసాద్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అయితే ఇటీవల కారు పార్కింగ్ విషయమై శివప్రసాద్ అనే వ్యక్తి తగాదాపడి తరువాత రాజీ పడ్డాడు. కాగా బుధవారం నాగసత్యఫణి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా అంబేడ్కర్ బొమ్మ వద్ద శివప్రసాద్ అటకాయించి తగాదాపడి దాడి చేశాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదలకు అన్నదానం

పెనమలూరు: యనమలకుదురుకు చెందిన మెండెం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. సంస్థ నిర్వాకురాలు వీరంకి కీర్తి గురువారం వివరాలు తెలుపుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా అనాథలకు, రోడ్డు పక్కన నివశించే పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి యనమలకుదురు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పేదలు దాదాపు 200 మందికి అన్నదానం చేశామన్నారు. పండ్లు, దుప్పట్లు కూడా పంపిణీ చేశామని తెలిపారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు: వృద్ధుడు అదృశ్యం ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన చాట్ల జేమ్స్ (65) గత నెల 30వ తేదీ నుంచి కనిపించటం లేదు. స్థానికంగా విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో జేమ్స్ కుమార్తె శకుంతల కంకిపాడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రింటర్ బహూకరణ

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని హెచ్ఎం పద్మవాణి అన్నారు. మానికొండ జెడ్పీ హైస్కూల్‌కు కాటూరి విజయ్‌బాబు (రైల్వే స్టేషన్ బుకింగ్ సూపర్ వైజర్) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.25 వేలు విలువగల ప్రింటర్‌ను గురువారం బహూకరించారు. అలాగే పదవ తరగతి విద్యార్థులు సాయంత్ర అల్పాహారానికి పూర్వ విద్యార్థి విశ్రాంత మున్సిపల్ కమిషనర్ మన్నే ఏసుదాసు అందజేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నున్న(విజయవాడరూరల్): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని నార్త్ జోన్ ఏసీపీ సీహెచ్ రవికాంత్ అన్నారు. గురువారం నున్న గ్రామంలోని వికాస్ కాలేజీలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నున్న పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికాంత్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. విజయవాడను మాదకద్రవ్య రహిత నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ రమణమూర్తి, ఏసీపీ ప్రభాకర్ మాట్లాడారు. నున్న సీఐ కె.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని తీర్మానం

నున్న(విజయవాడరూరల్): గొల్లపూడి-అవుటుపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారికి సర్వీసురోడ్డు నిర్మించాలని కోరుతూ గ్రామ పంచాయతీ సమావేశం తీర్మానించింది. గురువారం గ్రామ సర్పంచ్ కాటూరి సరళ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ఉపసర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, పాలకవర్గం సభ్యులు, కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

110 మందికి కంటి పరీక్షలు

కంకిపాడు: మండల కేంద్రంలోని సబ్ సెంటరులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్ 3 కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ 110 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎ.కృష్ణకుమారి మాట్లాడుతూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: పేదల అభ్యున్నతికే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. చోడవరం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్‌లు లబ్ధిదారులకు అందచేసి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో రైతులు, విద్యార్థులు, వృత్తిదారులు, పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. చోడవరం గ్రామంలో రూ.16 కోట్లు ఆర్థిక సాయం పేదలకు ప్రభుత్వం అందించిందని వివరించారు.

చంద్రబాబుకు పేదలు కనిపించరు...

చంద్రబాబు కళ్లకు పేదలు కనిపించరని తెలిపారు. చంద్రబాబు 14 సంవత్సరాల పాలనలో అద్దె ఇళ్లల్లో ఉన్న పేదలు ఎందుకు కనిపించలేదన్నారు. నేడు జగనన్న రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని మరి ఈ పేదలు చంద్రబాబుకు ఎందుకు కనిపించలేదని ప్రశ్నించారు. అదే విధంగా చంద్రబాబు పాలనలో 40 లక్షల మందికే పింఛన్లు ఇచ్చారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. జగనన్న పాలనలో పెనమలూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి టీడీపీ జీవితకాలంలో చేయలేదని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్క విషయాన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో దీనికి సమాధానం కనబడుతుందన్నారు. గ్రామ సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఎంపీడీఓ సునితాశర్మ, వైఎస్సార్ సీపీ నేతలు మండూరు కోటేశ్వరరావు, మానికొండ సూర్యతేజ, గోనే శైలజ, లింగాల సాంబశివరావు, చోడవరపు నిర్మల, చోడవరపు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, దివినాగఫణీంద్ర, పొద్దుటూరు రవి, చోడవరపు నాగరాజు, చోడవరపు రవిచంద్ పాల్గొన్నారు.

గంగానమ్మకు పూజలు..

వణుకూరు గ్రామంలో గంగానమ్మకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దేవస్థానం తొలి వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో గోపూజ



వెండి గిన్నెలను అందజేస్తున్న మద్దినేని దంపతులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో గురువారం గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 5న లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి రజతోత్సవ కల్యాణ మహోత్సవంలో భాగంగా ఈ వేడుకను జరిపారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పాల పొంగళ్లు సమర్పించారు. అనంతరం కన్యగోవులకు భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. సాయంత్రం శ్రీలలితా సహస్రనామ పారాయణం, లక్ష పుష్పార్చన జరిపారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, ఉప సర్పంచ్ పాలడుగు నాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబు, ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి గిన్నెలు బహూకరణ...

లక్ష్మీతిరుపతమ్మకు నైవేద్యాలు సమర్పించేందుకు ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు మద్దినేని వెంకటేశ్వరరావు, నాగమణి దంపతులు వెండి గిన్నెలను బహూకరించారు. సుమారు రూ. 1.50 లక్షలు విలువైన వెండి గిన్నెలను ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. అనంతరం వెండి గిన్నెలను అమ్మవారి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సొసైటీ బాధితులను ఆదుకోవాలి

ఉంగుటూరు: ఆత్కూరు పీఏసీఎస్‌లో నగదు గోల్‌మాల్ వ్యవహారంలో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం, బ్యాంకు అధికారులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని బాధితులు కోరారు. ఆత్కూరు పీఏసీఎస్ వద్ద తమకు న్యాయం చేయాలంటూ బాధితులు చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా గురువారం వంటావార్పు కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు కాయాకష్టం చేసీ సొసైటీలో దాచుకున్న డబ్బులు గత ఏడాది జూన్‌లో కార్యదర్శి సూరవరపు శంకర్‌రావు, అకౌంటెంట్ శివకుమారి గోల్‌మాల్ చేసి రూ.2.65 కోట్లు దోచుకున్నారని చెప్పారు. బాధితుల ఫిర్యాదుతో అధికారులు విచారణ చేసి నగదు గోల్‌మాల్ జరిగినట్లు నిర్ధారించారు. నష్టపోయిన వారికి నగదు చెల్లిస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయలేదన్నారు. హామీని విస్మరించిన బ్యాంకు అధికారులు తక్షణమే బాధితులకు నష్టపోయిన సొమ్ము చెల్లించాలని కోరారు. తమకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కె.సతీష్, కె.సుబ్బారెడ్డి బాధితులు పాల్గొన్నారు.

కరాటేలో డీపీఎస్ విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రామవరప్పాడు: ఇటీవల నిర్వహించిన కరాటే పోటీలలో పాఠశాల విద్యార్థి మహత్రు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించడంతో పాటు జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. ఎస్ భువనేశ్వరన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా భువనేశ్వరన్ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే 66వ జాతీయ కరాటే పోటీలకు ఈ పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న వై. మహత్రు ఎంపికయ్యాడన్నారు. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర పోటీలకు మహత్రు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించాడన్నారు. ఈ పోటీల్లో బంగారు పతకం సాధించడంతో పాటు, రాష్ట్ర జట్ల ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ ఖదీర్

ఉయ్యూరు: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగాలని ఉయ్యూరు ఎస్ఈబీ సీఐ ఎం ఏ ఖదీర్ కోరారు. స్థానిక ఏజీఅండ్ఎస్జీ సిద్ధార్థ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నినాదంతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ ఖదీర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సమాజాన్ని భ్రష్టు పట్టించే మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరించి చట్టప్రకారం తీసుకునే చర్యలను వివరించారు. ఎస్ఐ యుగంధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఎమ్మెల్యే వంశీమోహన్



హనుమాన్ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడులోని గ్రామ సచివాలయం-2 పరిధి హనుమాన్ నగర్‌లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, గ్రామస్తులు ఎమ్మెల్యే వంశీమోహన్‌కు అపూర్వ స్వాగతం పలికారు. గ్రామ సచివాలయం అధికారులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇప్పటి వరకూ ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధి వివరాలను బుక్‌లెట్ ద్వారా పంపిణీ చేశారు. పలుచోట్ల తమ ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఎదుగేరి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆయన ఆప్యాయంగా పలుకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, హౌసింగ్ లోన్లు మంజూరు కోసం ఎమ్మెల్యే వంశీమోహన్‌కు పలువురు విజ్ఞప్తులు అందజేశారు. ప్రతి సమస్యను ఆయన సవివరంగా అడిగి తెలుసుకుని, దాన్ని స్వయంగా ఆయన డైరీలో నమోదు చేసుకున్నారు.

డ్రైనేజీలు, సీసీ రోడ్లకు శంకుస్థాపన....

హనుమాన్ నగర్‌లో డ్రైనేజీతో పాటు పలు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వంశీమోహన్ శంకుస్థాపన చేశారు. పలుచోట్ల పేద విద్యార్థుల ఫీజులు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆయన సొంతంగా ఆర్థిక సాయంగా అందించారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బందితో కొద్దిసేపు ఆయన సమావేశమై ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై చర్చించారు. గ్రామంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఆరా తీశారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులతోనూ ఆయన సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని, వెళ్లిన ప్రతిచోట లబ్ధిదారులు ప్రభుత్వం పాలన పట్ల ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే వంశీమోహన్ చెప్పారు. మన బడి నాడు-నేడు, అమ్మ ఒడి, రైతుభరోసా, వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యా దీవెన వంటి విప్లవాత్మక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, బాపులపాడు, గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఎంపీపీ యర్రగొర్ల నాగేష్, సర్పంచ్ సరిపల్లి కమలభాయి, పీఏసీఎస్ చైర్మన్‌లు యర్రంశెట్టి రామాంజనేయులు, చిన్నాల సత్యగణేష్, కొల్లి బ్రహ్మారావు, మూల్పూరు ప్రభుకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు వింతా శంకర్‌రెడ్డి, కొమరవల్లి కిరణ్‌మూర్తి, కట్టా వాసు, ఎంపీటీసీ సభ్యులు పడకల కోటేశ్వరరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా పాల్గొన్నారు.

93.95 శాతం మందికి పింఛన్ల పంపిణీ



విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలంలో గత రెండు రోజులుగా వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ కొనసాగుతోంది. గురువారం నాటికి మండలంలో 93.95 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. మండలంలో మొత్తం 16,584 మంది లబ్ధిదారులకు గాను 15,581 మందికి పింఛన్లు అందించామని పేర్కొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



పెనమలూరు: పింఛన్‌ల పంపిణీలో వలంటీర్లు తమ చిత్తశుద్ధిని చాటుతున్నారు. పెనమలూరు గ్రామానికి చెందిన కొండదుర్గ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ తీసుకుంటూ విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంది. పెనమలూరు సచివాలయం వన్‌వలంటీర్ వి.వాణిశ్రీ విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాధితురాలికి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ సొమ్ము అందచేసింది. మండల పరిధిలో పింఛన్ దారులు ఎక్కడ ఉన్నా వలంటీర్లు వెళ్లి సకాలంలో పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవల పట్ల పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గృహాల నిర్మాణం వేగవంతం చేయాలి

పెనమలూరు: వణుకూరు జగనన్న కాలనీలో గృహాలు వేగంగా నిర్మాణం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తాడిగడప మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం, వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్‌లతో కలిసి వణుకూరు గ్రామం లేఅవుటు నాలుగులో యనమలకుదురుకు చెందిన లబ్ధిదారుల గృహ నిర్మాణాలు పరిశీలించారు. 984 మందికి ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఇందులో 222 మంది గృహాల నిర్మాణం చేపట్టారని అందులో 49 మంది గృహాల నిర్మాణం పూర్తి చేశారని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులను సిబ్బంది చైతన్యం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. సకాలంలో మెటీరియల్, ఇసుక కూపన్‌లు అందచేస్తామన్నారు. బ్యాంకు ఖాతాలో బిల్లుల సొమ్ము కూడా ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

నాడు- నేడు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మహేశ్వరరావు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మనబడి నాడు- నేడు పనులను అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి. మహేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి పనుల వివరాల గురించి పాఠశాల హెచ్ఎం బట్టు సురేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంత వరకు ఖర్చు చేశారు, మిగులు నిధులను ఏ విధంగా ఖర్చు చేయాలి, పనులు వేగవంతం చేయడానికి పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల మరుగుదొడ్లను పరిశీలించి టీఎంఎఫ్, ఎస్ఎంఎఫ్ నిధులను సద్వినియోగపరుచుకుని సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. పాఠశాల దక్షిణం వైపు మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెరుగైన పారిశుద్ధ్యం కల్పించాలని చెప్పారు.

ఊపిరున్నంత వరకు జగన్ వెంటే నడుస్తా

డాక్టర్ దుట్టా రామచంద్రరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నాలుగు దశాబ్దాలుగా వైఎస్సార్ కుటుంబంతో తనకు సాన్నిహిత్యం ఉందని, తన ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని ఆ పార్టీ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు అన్నారు. కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లోని ఆయన నివాసంలో గురువారం మీడియాతో మాట్లాడారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి పిచ్చాపాటిగా మాట్లాడుతున్న వీడియోను ఎల్లో మీడియా ప్రదర్శిస్తూ, తాము చర్చించని అంశాలను కూడా మాట్లాడినట్లుగా తప్పుడు కథనాలను ప్రసారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కుట్రలో భాగంగానే తాము మాట్లాడని విషయాలపై అసత్యాలను ప్రసారం చేస్తున్నారన్నారు. పేదలకు వైద్య సేవలను అందించటంలోనే తనకు సంతృప్తి ఉందని, పదవి ఇచ్చినా, ఇవ్వకపోయినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే కలిసి రాజకీయ ప్రయాణం చేస్తానని తేల్చి చెప్పారు. తనకు పదవులు ముఖ్యం కాదని, వైఎస్సార్ కుటుంబమే ముఖ్యమని చెప్పారు.

డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వైద్యశాల ప్రారంభం



సంచార పశు వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: మూగ జీవులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు బాపులపాడు ప్రాంతీయ పశు వైద్యశాలకు కేటాయించిన సంచార వైద్యసేవల వాహనాన్ని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రారంభించారు. పాడిరైతులు టోల్‌ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేయాలని, రైతుల ఇంటి వద్దకే సంచార వాహనం ద్వారా సేవలు ఉచితంగా పొందవచ్చని ఏడీ వై.మురళీధర్ చెప్పారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైద్యులు వల్లిబాబు, దుర్గాభవాని, అనామిక పాల్గొన్నారు.

పెదపులిపాకలో ఆయుష్ వైద్య సేవలు



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటకృష్ణ

పెనమలూరు: మండలంలోని పెదపులిపాక గ్రామంలో విద్యార్థులకు వైద్య సేవలు అందించామని ఆయుష్ రీజినల్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటకృష్ణ తెలిపారు. పెదపులిపాక గ్రామంలోని ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధుల పట్ల తల్లులకు అవగాహన కల్పించామని చెప్పారు. వ్యాధులు రాకుండా ఉండటానికి ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. కానూరు ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యురాలు కె. రాగలత, కాంపౌడర్ మూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు వారాల్లో పూర్తి సమాచారం ఇవ్వండి

కృష్ణాజిల్లా రిజిస్ట్రారును ఆదేశించిన సమాచార కమిషనర్ ఐలాపురం రాజా

ఉయ్యూరు: రెండు వారాల్లో పూర్తి సమాచారం అందించాలని, ఈ నెల 8వ తేదీ స్వయంగా కమిషనర్ ముందు హాజరుకావాలని కృష్ణా జిల్లా రిజిస్ట్రారు ఉపేంద్రరావును రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉయ్యూరుకు చెందిన సమాచార హక్కు చట్టం సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లా రిజిస్ట్రారు కార్యాలయ పరిధిలో తప్పుడు రిజిస్ట్రేషన్లు, దస్తావేజులపై వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలు, క్రిమినల్ కేసుల వివరాలను 2017 మార్చిలో సహ చట్టం ద్వారా కోరామన్నారు. సమాచారం లభించని కారణంగా రాష్ట్ర సమాచార కమిషన్‌కు అదే ఏడాది ఏప్రిల్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా రెండు వారాల్లోగా సమాచారం అందించాలని జిల్లా రిజిస్ట్రారు ఉపేంద్రరావును ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ నెల 8న స్వయంగా కమిషనర్ ముందు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు.

లెప్రసీ నివారణకు అవగాహనే మార్గం

జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకట్రావు

గన్నవరం రూరల్: లెప్రసీ నివారణకు అవగాహన ముఖ్యమని జిల్లా లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ.వెంకట్రావు తెలిపారు. ముస్తాబాద జడ్పీ హైస్కూల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన విద్యార్థులకు లెప్రసీ నిరోధంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్పర్శలేని మచ్చలు, రాగి మచ్చలు గుర్తించాలని సూచించారు. లావుగా మారిన నరములు నొప్పితో ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవటం కూడా వ్యాధి లక్షణమని చెప్పారు. విద్యార్థులు ఈ విషయాలను తెలుసుకోవటంతో పాటు ప్రచారం చేయాలన్నారు. జిల్లా ఎస్ఎంఓ డాక్టర్ ఎం.వేణుగోపాలరావు, డీపీఎంవో డాక్టర్ వెంకట్ రాజు, స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌వో మెర్సి, హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.